మహబూబాబాద్ రూరల్: లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్

నిరుపేదల సమస్యలు పరిష్కరించాలి

- అందరికీ సమానంగా పథకాలు వర్తింపజేయాలి
- సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీలో ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 06: అధికారంలో ఉన్న ప్రభుత్వాలు నిరుపేదల సమస్యలను పరిష్కరించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని క్యాంప్ కార్యాలయంలో బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసి మాట్లాడారు. ఎప్పుడో మంజూరైన చెక్కులను ప్రభుత్వం కావాలనే ఆలస్యం చేసిందని, ఏ సర్కారు అధికారంలో ఉన్నా ప్రజలకు అండగా నిలవాలన్నారు. కొందరు నాయకులు కావాలనే బీఆర్ఎస్ పార్టీకి చెందిన వారని చెప్పి చెక్కులను నిలిపివేస్తున్నట్లు తెలుస్తున్నదని, అలా చేయకుండా ప్రతి నిరుపేదకు అందించాలని డిమాండ్ చేశారు. ఏ సమస్య వచ్చినా వెంటనే తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

దంతాలపల్లి: దంతాలపల్లికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు నాయిని రఘునందన్‌రెడ్డి సతీమణి విజయలక్ష్మి ఇటీవల మృతి చెందగా, మంగళవారం ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. విజయలక్ష్మి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీ జిల్లా నాయకుడు నాయిని శ్రీనివాస్‌రెడ్డి, కిసాన్‌నాయక్, కిశోర్‌కుమార్ ఉన్నారు.

స్రవంతి కుటుంబ సభ్యులకు..

మరిపెడ: మున్సిపాలిటీలోని 4వ వార్డు కౌన్సిలర్ మాచర్ల స్రవంతి ఇటీవల మృతి చెందగా, మంగళవారం బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్సీ సత్యావతి రాథోడ్ పరామర్శించారు. స్రవంతి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

'సార్'కు ఘన నివాళి

- జయశంకర్ ఆశయాలను కొనసాగించాలి
- జిల్లాలో ఘనంగా ప్రొఫెసర్ జయంతి
- పాల్గొన్న ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు

తొర్రూరు: సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ప్రజాప్రతినిధులు, విగ్రహ కమిటీ ప్రతినిధులు

మహబూబాబాద్ రూరల్/తొర్రూరు/ డోర్నకల్/ చిన్నగూడూరు/గార్ల/కేసముద్రం/ పెద్దవంగర/ గూడూరు, ఆగస్టు 6: తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య జయశంకర్ సార్ జయంతి వేడుకలను మంగళవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. గ్రామ గ్రామానా ప్రొఫెసర విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రముఖులు మాట్లాడుతూ.. జయశంకర్ సార్ రూపొందించిన నీళ్లు, నిధులు, నియామకాలు సిద్ధాంతాల ఆధారంగానే తెలంగాణ ఉద్యమం చేపట్టి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకున్నామని తెలిపారు. ఎన్నో త్యాగాలు చేసిన ప్రొఫెసర్ ఆశయాలను ప్రతి ఒక్కరూ కొనసాగించాలన్నా రు. మహబూబాబాద్‌లో ప్రైవేట్ కాలేజీ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సంకెపల్లి శ్రీనివాస్‌రెడ్డి సార్ చిత్రపటానికి పూలమాల వవేసి నివాళులర్పించారు. డోర్నకల్ మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ వాంకుడోత్ వీరన్న, కేసముద్రం మార్కెట్ కార్యాలయంలో కార్యదర్శి అమర లింగేశ్వరరావు సార్ చిత్రపటానికి నివాళులర్పించారు. తొర్రూరులోని అమ్మాపురం రహదారిలో ప్రొఫెసర్ విగ్రహ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు దేవరకొండ కృష్ణప్రసాద్, సిరికొండ విక్రమ్, కోశాధికారి బీ సురేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్ర య్య, కమిషనర్ శాంతికుమార్, వైస్‌చైర్మన్ సురేందర్‌రెడ్డి, జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

చిన్నగూడూరు: సార్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న డీడబ్ల్యూవో వరలక్ష్మి

గూడూరు: ఎంపీడీవో కార్యాలయంలో పూలమాల వేస్తున్న అధికారులు

డోర్నకల్: మున్సిపల్ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న చైర్మన్ వీరన్న

స్వచ్ఛతతోనే సంపూర్ణ ఆరోగ్యం

- పరిసరాల శుభ్రత పాటించాలి
- జిల్లాలో రెండో రోజూ కొనసాగిన 'స్వచ్ఛదనం-పంచ్ఛదనం'..

డోర్నకల్/ పెద్దవంగర/ చిన్నగూడూరు/ మహబూబాబాద్‌రూరల్/ దంతాలపల్లి, ఆగస్టు 6: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'స్వచ్ఛదనం- పచ్చదనం' కార్యక్రమం రెండో రోజూ మంగళవారం జిల్లాలోని గ్రామాలు, మండలాలు, మున్సిపాలిటీల్లో కొనసాగింది. ఈ సందర్భంగా జీపీ, మున్సిపల్ అధికారుల పాల్గొన్నారు. పారిశుధ్య పనులను పరిశీలించి సలహాలు ఇచ్చారు. పరిసరాల శుభ్రత పాటించాలని డోర్నకల్ ఎంపీడీవో శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం తోడేళ్లగూడెంలో తాగునీటి శుద్ధి గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. కొత్తగూడలోని ఫారెస్టు కార్యాలయంలో డీఎఫ్‌వో విశాల్, ఎఫ్‌డీవో చంద్రశేఖర్ మొక్కలు నాటారు. మొక్కలను నాటి సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. డోర్నకల్‌లో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని సీడీఎంఏ కృష్ణమోహన్‌రెడ్డి తనిఖీ చేశారు. అధికారులకు సలహాలు సూచనలు చేశారు.

డోర్నకల్: పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న సీడీఎంఏ కృష్ణమోహన్‌రెడ్డి

కొత్తగూడ: మొక్క నాటుతున్న డీఎఫ్‌వో విశాల్

సంపూర్ణ సురక్ష కేంద్రాన్ని వినియోగించుకోవాలి

నెల్లికుదురు, ఆగస్టు 6: సమాజం లో చాలా మంది హెపటైటిస్, హెచ్‌ఐవీ తదితర రోగాల బారిన పడకుండా సంపూర్ణ సురక్ష కేంద్రం కృషి చేస్తున్నదని, సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాని సంపూర్ణ సురక్ష కేంద్ర మేనేజర్ రమేశ్ అన్నారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మంగళవారం మండల వైద్యాధికారి నందన అధ్యక్షతన అవగాహన కల్పించారు. రక్త పరీక్షలు చేయించుకోవాలని, లివర్ సమస్యలను మొదటి దశలో గుర్తిస్తే వ్యాధిని తగ్గించుకోవచ్చునారు. సమాచారం కోసం 1097కు ఫోన్ చేయవచ్చున్నారు. మెడికల్ ఆఫీసర్ నందన, అవుట్ రీచ్ వర్కర్లు గౌతమి పాల్గొన్నారు.

చిన్నగూడూరు : పంట పొలంలో నిలిచిన వర్షపు నీరు

జిల్లాలో ఎడతెరిపి లేని వాన

మహబూబాబాద్ రూరల్/ చిన్నగూడూరు, ఆగస్టు 6: జిల్లాలోని పలు మండలాల్లో మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కరిసింది. ప్రధానంగా డోర్నకల్, కురవి, కొత్తగూడ, గంగారం, బయ్యారం మండలాల్లో అధిక వర్షపాతం నమోదైంది. పలు చోట్ల కాలనీలు, రోడ్లపై నీరు నిలిచింది. అధికారులు సిబ్బందితో పారిశుధ్య పనులు చేయించారు. జిల్లా కేంద్ర పరిధిలోని వీఎస్ లక్ష్మీపురం, జంగిలి కొండ, పర్వతగిరి గ్రామాల్లో చెట్లు నేలకూలాయి. రహదారిపై చెట్టు విరిగి రోడ్డుపై పడగా రూరల్ ఎస్సై దీపికారెడ్డి గమనించి ట్రాఫిక్‌కు సమస్య లేకుండా పోలీసులతో చెట్ల కొమ్మలను తొగించి క్లియర్ చేశారు. చిన్నగూడూరు మండలంలోని ఆకేరు వాగుకు వరద చేరింది. దీంతో రైతులు సాగు చేసిన పొలాల్లో నీరు నిండింది. మరి కొందరు రైతులు వర్షం తమకు మేలు చేసిందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కొత్తగూడలో 3.3 సెంటీమీటర్లు, గంగారం 4.6సెం.మీ, బయ్యారం 6.4సెం.మీ, గార్ల 6.7సెం.మీ, డోర్నకల్ 6.5సెం.మీ, కురవి 6.1సెం.మీ, మానుకోట 4.2సెం.మీ, గూడూరు 4.2సెం.మీ, కేసముద్రం 5.1సెం.మీ, నెల్లికుదురు 2.4సెం.మీ, నర్సింహులపేట 4.2సెం.మీ, చిన్నగూడూరు 8.1సెం.మీ, మరిపెడ 9,2సెం.మీ, దతాలపల్లి 1.6సెం.మీ, తొర్రూరు 1.1సెం.మీ, పెద్దవంగరలో 1.2 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు వాతావరణ అధికారులు తెలిపారు.

నల్ల బెల్లం, పటిక పట్టివేత

నెల్లికుదురు, ఆగస్టు 6: అక్రమంగా నిల్వ చేసిన 5 క్వింటాళ్ల బెల్లం, 50 కిలోల పటికను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సీహెచ్ రమేశ్‌బాబు తెలిపారు. మండలంలోని జామతండాలో అక్రమంగా నల్ల బెల్లం నిల్వ చేసి విక్రయిస్తున్నారనే సమాచారంతో మంగళవారం తండాలో దాడులు చేశారు. గుగులోత్ వెంకన్న ఇంట్లో 10 బస్తాల్లో 5 క్వింటాళ్ల నల్లబెల్లం, బస్తాలో 50 కిలోల పటికను స్వాధీనం చేసుకొని వెంకన్నను విచారించారు. తనకు అదే తండాకు చెందిన గుగులోత్ శంకర్, భూక్యా సుమన్ అమ్మినట్లు తెలిపారని, ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

కాల్వపై చెట్ల తొలగింపు

దంతాలపల్లి, ఆగస్టు 6: ఎస్సారెస్పీ డీబీఎం-60 కాల్వపై చెట్ల తొలగింపు పనులను మంగళవారం ఆ శాఖ డీఈ వినయ్ ప్రారంభించి మాట్లాడారు. ఎస్సారెస్పీ డీబీఎం-60 కాల్వ 9కిలోమీటర్లుండగా ఇరువైపులా ముళ్ల కంపలు, చెట్లు పెరిగాయని, వాటిని తొలగించేందుకు ప్రభుత్వం రూ. 8.50 లక్షల నిధులు మంజూరు చేసిందని, వాటితో చెట్లను తొలగింపజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఈ మౌనిక, వర్క్ ఇన్‌స్పెక్టర్ దేవేందర్ పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతికి కృషి చేస్తా

ఎమ్మెల్యే భూక్యా మురళీనాయక్

ఇనుగుర్తి, ఆగస్టు 6: నిరుపేదల ఆర్థిక అభివృద్ధికి కృషి చేస్తానని మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్యా మురళీనాయక్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతువేదికలో 17 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేసి మాట్లాడారు. కల్యాణలక్ష్మి పథకం పేదింటి ఆడబిడ్డల కుటుంబాలకు వరంలాంటిదన్నారు. త్వరలో మండలానికో పోలీస్‌స్టేషన్, ఎంపీడీవో కార్యాలయం వచ్చేలా కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దార్ దామోదర్, ఏవో వెంకన్న, కార్యదర్శి లక్ష్మీకాంత్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కూరెల్లి సతీశ్, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

పర్యావరణానికి మొక్కలే ఆధారం

నెల్లికుదురు: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని ఎమ్మెల్యే మురళీనాయక్ అన్నారు. 'స్వచ్ఛదనం-పచ్చదనం'లో భాగంగా మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో మంగళవారం ఎమ్మెల్యే మొక్కలు నాటి మాట్లాడారు. కార్యక్రమంలో షెడ్యూల్ వారీగా నిర్దేశించిన పనులు చేయాలన్నారు. మొక్కల పెంపకంతో అడువుల విస్తీర్ణం పెరిగి వర్షాలు సమృద్ధిగా కురుస్తాయన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి మరియన్న, ఎంపీడీవో బాలరాజు, తహసీల్దార్ రాజు, ఎంపీవో పద్మ, మండల నోడల్ ఆఫీసర్ రాందాస్, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఇనుగుర్తి: లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

అణగారిన వర్గాల గుండె చప్పుడు గద్దర్

- యువత ఆయనను స్ఫూర్తిగా తీసుకొని ఉద్యమించాలి
- జిల్లా వ్యాప్తంగా గద్దర్ విగ్రహాలు, ఫ్లెక్సీలకు నివాళి

మహబూబాబాద్ రూరల్: గద్దర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సంఘాల నాయకులు

మహబూబాబాద్ రూరల్/ కురవి, ఆగస్టు 6: ప్రజా యుద్ధనౌక గద్దర్ ప్రథమ వర్ధంతి కార్యక్రమాలను మంగళవారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించారు. ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు ప్రముఖులు, రాజకీయ, సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. అణగారిన వర్గాల గుండె చప్పుడని, తన ఆటపాటలతో ఎంతో మందిని ఉద్యమం వైపు నడిపిస్తూ సమాజంలో చైతన్యం తీసుకొచ్చారన్నారు. నేటి యువత గద్దర్‌ను స్ఫూర్తిగా తీసుకొని ఉద్యమించాలన్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

కురవి, ఆగస్టు 8: అప్పుల బాధతో మనస్తాపానికి గురై యాసిడ్ తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. మండలంలోని చంద్యాతండాకు చెందిన మాలోత్ వాసు(36) రెండేళ్లుగా ఘట్‌కేసర్ వద్ద డీసీఎం నడుపుకుంటూ జీవిస్తున్నాడు. ఫైనాన్స్‌లో డీసీఎం తీసుకొని వెళ్లగా ఆర్థిక పరిస్థితి ఇబ్బందిగా మారడంతో మనస్తాపం చెంది గత నెల 29న యాసిడ్ తాగాడు. వెంటనే చికిత్స కోసం దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడని తెలిపారు.

మరిపెడలో వసంత్..

మరిపెడ: చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఎస్సై తాహేర్‌బాబా కథనం ప్రకారం.. మరిపెడ బస్టాండ్‌లో రెండ్రోజుల క్రితం గుర్తు తెలియని వ్యక్తి పురుగుల మందు తాగాడు. స్పృహ కోల్పోయిన అతడిని స్థానికులు దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి పర్సులో ఆధార్‌కార్డు ద్వారా వివరాలు సేకరించగా ఆదిలాబాద్ జిల్లాలోని తోంషతండాకు చెందిన వ్యక్తిగా నిర్ధారించి కుటుంబానికి సమాచారం అందించారు. మృతుడి భార్య పుష్పలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నూతన గ్రామ పంచాయతీల ఏర్పాటు

దంతాలపల్లి, ఆగస్టు 6: మండలంలోని తూర్పుతండా గ్రామ పంచాయతీ పరిధిలో నూతన గ్రామ పంచాయతీ ఏర్పాటైనట్లు ఎం పీడీవో వివేక్‌రామ్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. తూర్పుతండా జీపీ పరిధిలో నాలుగు తండాలుండగా వాటిలో దుబ్బతండా, రేఖ్యతండా, మోగ్యతండాలను కలిపి నూతన గ్రామ పంచాయతీ చేయాలని అప్పటి ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో కేసీఆర్ ప్రభుత్వం సానుకూలంగా వ్యవహరించగా తూర్పుతండా నుంచి వేరు చేస్తున్న దుబ్బతండా జీపీగా చేస్తూ ప్రభుత్వం గెజిట్ విడుదల చేసినట్లు ఎంపీడీవో తెలిపారు.

తొర్రూరులో రెండు పంచాయతీలు..

తొర్రూరు: మండలంలో రెండు నూతన గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం రూపొందించిన గెజిట్‌ను మంగళవారం విడుదల చేసింది. శాసనసభలో ఆమోదం పొందిన ప్రకారం మాటేడు గ్రామ శివారుగా ఉన్న కిష్టాపురం, గతంలో వెలికట్ట పరిధిలో ఉన్న భోజ్యతండా పరిధిలోని ఈదులకుంట తండా నూతన గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం జారీ చేసిన గెజిట్‌లో వివరాలు పొందుపరిచారు.

విద్యార్థులు పట్టుదలతో చదవాలి

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 6: సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సాంఘిక సంక్షేమ వసతి గృహాల సెక్రటరీ వర్షిణి అన్నారు. మంగళవారం పట్టణంలోని గురుకుల పాఠశాలను కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్‌తో కలిసి సందర్శించారు. విద్యార్థులకు ఆహ్లాదకర వాతావరణం అందించాలన్నారు. ప్రభుత్వం బాలికల విద్య కోసం అనేక సౌకర్యాలు కల్పిస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆర్డీవో అలివేలు, జడ్పీ సీఈవో నర్మద, డీపీవో హరిప్రసాద్, తహసీల్దార్ భగవాన్‌రెడ్డి పాల్గొన్నారు.

కరాటేలో 'వికాస్' విద్యార్థిని ప్రతిభ

మెడల్స్ అందుకుంటున్న సరయు

తొర్రూరు, ఆగస్టు 6: జాతీయ స్థాయి కరాటే పోటీల్లో మండల కేంద్రంలోని వికాస్ స్కూల్ విద్యార్థిని చింత సరయు ప్రతిభ కనబరిచి మెడల్స్ సాధించినట్లు పాఠశాల కరస్పాడెంట్ తాళ్లపెల్లి రమేశ్ మంగళవారం తెలిపారు. ఇటీవల వరంగల్‌లో జేడబ్ల్యూఎంసీ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన 9వ జాతీయ స్థాయి కరాటే పోటీల్లో సరయు ప్రతిభను చాటి గోల్డ్, సిల్వర్ మెడల్స్ సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరాటే ఛాంపియన్ -2024 పోటీల్లో అండర్-14లో గ్రీన్ బెల్ట్ విభాగంలో గోల్డ్ మెడల్, కుమిటీ (స్పైరింగ్)లో సిల్వర్ మెడల్ సాధించినట్లు పేర్కొన్నారు. ఫెస్కో భారత్ అధ్యక్షుడు హసన్ ఇస్మాయిల్, సీఐ శోభన్ బాబు అందజేశారు. కరాటే మాస్టార్ శ్రీధర్, రాజ్‌కుమార్, తల్లిదండ్రులు సోమసుందర్, రజని, ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

డోర్నకల్, ఆగస్టు 6: విద్యార్థులు విద్యలో రాణించాలని, ఉత్తమ ఫలితాలు సాధించాలని డీఈవో రామారావు అన్నారు. మంగళవారం మన్నెగూడెం జడ్పీహెచ్ఎస్‌ను ఆయన సందర్శించి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి మాట్లాడారు. విద్యార్థుల హాజరు నమోదు పెంచాలని, అర్థం కానీ పాఠ్యాంశాలను ఉపాధ్యాయులను అడిగితే తెలుసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. ఆయన వెంట కాంప్లెక్స్ హెచ్ఎం రుక్మాంధరావు, హెచ్ఎం విత్తనాల సుధాకర్, ఉపాధ్యాయులు ప్రశాంతి ఉన్నారు.

ఏటిపై హైలెవల్ బ్రిడ్జి నిర్మించాలి

గార్ల, ఆగస్టు 6: మండల శివారు రాంపురంలో పాకాల ఏటిపై వెంటనే హైలెవల్ బ్రిడ్జి నిర్మించాలని బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు గుండెబోయిన నాగమణి అన్నారు. మంగళవారం ఏటి వద్ద నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. ఏరు వల్ల దశాబ్ద కాలం నుంచి రాంపురం, మద్దివంచ గ్రామాలకు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారని, వర్షకాలంలో విద్యార్థులు, ప్రజలు రైలు పట్టాల వెంట నడుచుకుంటూ వెళ్లాల్సిన వస్తోందని తెలిపారు. ప్రభుత్వం స్పందించి హైలెవల్ బ్రిడ్జి నిర్మించాలన్నారు.

జీపీ కార్మికుల వేతనాలు చెల్లించాలి

తొర్రూరు : సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షుడు రవి

తొర్రూరు/ కేసముద్రం/పెద్దవంగర/ దంతాలపల్లి/ ఆగస్టు 6: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న జీపీ కార్మికులకు వేతనాలు విడుదల చేయాలని తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్(ఐఎఫ్‌టీయూ అనుబంధం) రాష్ట్ర అధ్యక్షుడు కొత్తపల్లి రవి అన్నారు. తొర్రూరులోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో శుభ్రత, పరిశుభ్రత అంటూ జీపీ సిబ్బందిపై అదనపు పని భారాన్ని మోపుతున్నదని ఆరోపించారు. కనీస వేతనం అమలు, ఉద్యోగుల పర్మనెంట్, సిబ్బంది సంఖ్య పెంచడం, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, లేకపోతే సమ్మె చేస్తామని హెచ్చరించారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు బీకు, మండల అధ్యక్షుడు గుండాల సోమనర్సయ్య, మాజీ మండల అధ్యక్షుడు తండా లింగమూర్తి, నాయకులు శ్రీనివాస్, యాకూబ్, ప్రవీణ్ పాల్గొన్నారు. కేసముద్రంలో జీపీ కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని సీఐటీయూ మండల కార్యదర్శి జల్లె జయరాజ అన్నారు. మండల పరిషత్ కార్యాలయం ఎదుట ధర్నా చేసి సూపరింటెండెంట్ సత్యప్రకాశ్‌కు వినతిపత్రం అందించారు. పెద్దవంగరలో జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సంఘం మండల అధ్యక్షుడు కసరబోయిన కుమారస్వామి కార్మికులతో కలిసి ఎంపీడీవో బీ వేణుమాధవ్‌కు వినతి పత్రం అందించారు. దంతాలపల్లిలో జీపీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఈనెల 8న తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో 'సపాయి బందు' పేరుతో ఒకరోజు సమ్మె చేపడుతున్నట్లు సమ్మె నోటీసును ఎంపీడీవో వివేక్‌రామ్‌కు అందజేశారు.

కారు ఢీకొని యువకుడి మృతి

వెంకన్న(ఫైల్)

గూడూరు, ఆగస్టు 6: సైకిల్‌పై వెళ్తున్న వ్యక్తిని కారు ఢీకొట్టడంతో మృతి చెందిన ఘటన ఎన్‌హెచ్-365 హైవేపై మర్రిమిట్ట గ్రామంలో మంగళవారం జరిగింది. ఎస్సై నగేశ్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ధనసరి వెంకన్న(40) వ్యవసాయ పనుల కోసం సైకిల్‌పై వెళ్తున్న క్రమంలో గూడూరు నుంచి నర్సంపేటకు వెళ్తున్న కారు వెనుక నుంచి ఢీకొట్టి వెళ్లింది. దీంతో వెంకన్న తలకు బలమైన గాయాలు కాగా, గ్రామస్తులు, బంధువులు వరంగల్‌లోని ఎంజీఎం దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. మృతుడి భార్య కవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పీహెచ్‌సీలో డీఎంహెచ్‌వో తనిఖీ

వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రేమలత

కొత్తగూడ, ఆగస్టు 6: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రేమలత ఆకస్మికంగా తనిఖీ చేశారు. దవాఖాన ఆవరణ, రికార్డులను పరిశీలించి ఓపీ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆశ డేలో పాల్గొన్ని మాట్లాడారు. సమయపాలన పాటించాలని, విధుల్లో నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హెచ్ఈ గీత, ఎస్‌యూవో శ్రీనివాస్, పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది ఉన్నారు.


జడ్పీటీసీ సునీతా మురళీధర్‌రెడ్డిని సన్మానిస్తున్న గ్రామస్తులు

జడ్పీటీసీకి గ్రామస్తుల సన్మానం

చిన్నగూడూరు, ఆగస్టు 6: జడ్పీటీసీగా ఐదేండ్లు పదవీకాలం పూర్తి చేసుకున్న సందర్భంగా మూల సునీతా మురళీధర్‌రెడ్డిని మంగళవారం గుండంరాజుపల్లి గ్రామస్తులు, కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి కిరణ్, నగేశ్, నాయకులు రంజిత్‌రెడ్డి, ఏకాంబ్రం తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఖజానా శాఖ అధికారిగా సత్యనారాయణ

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 6: జిల్లా ఖజానా శాఖ అధికారిగా వీ సత్యనారాయణ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ విధులు నిర్వర్తించిన అధికారి రాములు సూర్యాపేటకు బదిలీ కాగా, ఆయన స్థానంలో ఖమ్మంలో పనిచేస్తున్న సత్యనారాయణ వచ్చారు. ఈ సందర్భంగా సత్యనారాయణకు కార్యాలయ అధికారులు, సిబ్బంది పుష్ప గుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపపారు. కార్యక్రమంలో రామకృష్ణ, అరుణ, వెంకన్న, సుందర్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

సాధారణ ప్రసవాల సంఖ్య పెంచాలి

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 6: జిల్లాలోని ప్రభుత్వ దవాఖానల్లో సాధారణ ప్రసవాల సంఖ్యను పెంచాలని జిల్లా వైద్యాధికారి కళావతీబాయి అన్నారు. మంగళవారం జిల్లా వ్యాప్తంగా పలు పీహెచ్‌సీలు, సబ్ సెంటర్లను సందర్శించి, సీజనల్ వ్యాధులపై తీసుకునే జాగ్రత్తలపై సమీక్షించారు. సాధారణ ప్రసవాలపై గర్భిణులకు అవగాహన కల్పించాలని, ప్రభుత్వ దవాఖానల్లో ఇచ్చిన మందులను ఉపయోగించుకునేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో మురళీధర్, ప్రోగ్రాం అధికారులు నాగేశ్వరరావు, లక్ష్మీనారాయణ, ప్రసాద్, జాదవ్ పాల్గొన్నారు.

మత్తు పదార్థాలను విక్రయిస్తే కఠిన చర్యలు

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 6: నిషేధిత మత్తు పదార్థాలను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని నార్కొటిక్ జాగిలాలతో తనిఖీలు చేసి మాట్లాడారు. బస్టాండ్, రైల్వే స్టేషన్ పార్సిల్ సెంటర్లు, అనుమానిత ఇండ్లలో తనిఖీలు చేశారు. అక్రమ వ్యాపారాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, ఎవరి వద్దనైనా గంజాయి, మత్తు పదార్థాలుంటే వెంటనే 100 డయల్ చేయాలని సీఐ తెలిపారు.

'న్యాయవాదులపై దాడులు సరికాదు'

తొర్రూరులో నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

తొర్రూరు, ఆగస్టు 6: జనగామలో సోమవారం అడ్వకేట్‌లు అమృతరావు, కవితపై పోలీసులు చేసిన దాడిని ఖండిస్తూ మంగళవారం తొర్రూరు బార్ అసోసియేషన్ న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించారు. అసోసియేషన్ బాధ్యులు మాట్లాడుతూ ఇటీవల న్యా యవాదులపై దాడులు పెరిగిపోతున్నాయని, ఇలాంటి దాడులు జరగడం ప్రజాస్వామ్య వ్యవస్థలో మంచి పరిణామం కాదన్నారు. వీటిని అరికట్టేందుకు న్యాయవాదుల రక్షణ చట్టాన్ని ప్రవేశ పెట్టాలన్నారు. ఇప్పటి వరకు జరిగిన సంఘటనలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠినచర్యలు తీసుకోవాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కలువకొలను ప్రవీణ్‌రాజు, జనరల్ సెక్రటరీ రామకృష్ణ, ట్రెసరర్ సైదులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

ప్రశంసా పత్రం అందుకుంటున్న ఎస్సై జగదీశ్

ఎస్సై జగదీశ్‌కు డీజీపీ ప్రశంస

తొర్రూరు, ఆగస్టు 6: తొర్రూరు ఎస్సైగా విధులు నిర్వర్తించి బదిలీపై వెళ్తున్న కే జగదీశ్‌కు డీజీపీ జితేందర్ ప్రశంసాపత్రం అందజేశారు. ఎస్సై జగదీశ్ చెన్నారావుపేట పోలీస్‌స్టేషన్‌లో పని చేసిన సందర్భంలో జరిగిన హత్యకు సంబంధించి జరిపిన విచారణ పకడ్బందీగా సాగడంతో నిందితుడికి యావజ్జీవ శిక్ష పడింది. దీంతో మంగళవారం హైదరాబాద్‌లోని పోలీస్ హెడ్‌క్వార్టర్‌లో ఎస్సైకి డీజీపీ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందజేశారు.

దాతల సహకారంతో మరుగుదొడ్ల నిర్మాణం

దంతాలపల్లి, ఆగస్టు 6: మండలంలోని బీరిశెట్టిగూడెం ప్రభుత్వ పాఠశాలలో దాతల సహకారంతో మరుగుదొడ్లు నిర్మించారు. పాఠశాలలో మొత్తం 75 మంది విద్యార్థులుండగా మరుగుదొడ్లు లేక ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న గ్రామాభివృద్ధి కమిటీ (వీడీసీ) ఆధ్వర్యంలో రూ. 30వేలతో మరుగుదొడ్లు నిర్మించారు. మంగళవారం పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం నగేశ్, వీడీసీ సభ్యులు ప్రారంభించారు. వీడీసీని ఉపాధ్యాయులు అభినందించారు. నాగయ్య, ఉమారాణి, నిర్మల, శ్రీమతి, వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

CHANGE OF NAME
I, YELA SATYA RANI (Before marriage), shall hence forth be changed as BATTULA PADMA SREE W/o BATTULA BHASKAR (After marriage) H.No.10-12-12, Girmajipet, Warangal (Mdl) & Dist.T.S 506002. for all future purpose.
NTW-000

WANTED
హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్ 6K. Ph: 9640258899 / 9640468899.
NT-325783

CHANGE OF NAME
I, SARALA CHOUDAVARAPU (Old Name), R/o H.No. 1-7-1545, Flat No. 305, Road No.7, Advocates Colony, Hanamkonda - 506001. Have changed my Name as MUNUKUNTLA SARALA W/o CHOUDAVARAPU LINGA MURTHY.
NTW-000

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం: 9182777552
HANAMKONDA 9182777563 9182777618
WARANAGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565